## జీవియస్

# సుశీల కథలు

# మల్లె మనసు

మేడమ్! మీరిక్కడ వుంటారని నేనూహించలేదు. అనుకోకుండా మిమ్మల్ని చూడగలిగాను''

''మావారు ఇక్కడ వుంటానని చెప్పారా?''

''హాస్టల్‌లో లేకపోతే ఇక్కడ వుండవచ్చునని వచ్చాను''

''వెయ్యి గుళ్ల పూజారి ఒకచోట దొరుకుతాడా?''

''ఏమైనా వారితో కలిగిన పరిచయాన్ని నేను నా జన్మలో మరచిపోలేను'' అని మల్లిక ఒక విధమైన తన్మయత్వంతో కలిసిన ఆవేశంతో చెప్పింది.

నాకాశ్చర్యం వేసింది. మావారిని అంతగా అభిమానించే ఆడవారున్నారని మొదటిసారి వింటున్నాను. మా అమ్మ మా నాన్నతో నన్ను హైదరాబాద్‌కు ఈసారి కూడా గురుపూర్ణిమకు పంపటం మంచిదే అయింది. మా నాన్నగారు గురువుగారి వద్ద త్రాటకయోగాన్ని ఆరంభించి సాధన చేస్తున్నారు. అందువల్ల గురుపూర్ణిమకు వచ్చిన మేము రాఖీపూర్ణిమ దాకా హైదరాబాదులోనే ఉండిపోవలసి వచ్చింది.

ఇదివరలో ఒకసారి గురుపూర్ణిమకే వచ్చాను. అప్పుడు మావారు మా బావగారితో కలిసి ఉన్నారు. ఇప్పటి పరిస్థితి వేరు. ఎం.ఏ., ఫైనల్ చదవటానికి ఏకాంతం కావాలని యూనివర్సిటీ హాస్టల్‌లో చేరారు. చదువుతున్నారన్న మాట. నిజమేనేమో కాని. తెలుగు విద్యార్థి సారస్వత సంఘానికి అధ్యక్షులుగా నిలబడుతున్నారట! అటు విద్యార్థి రాజకీయాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో, రేడియో ప్రోగ్రాముల్లో, నాటకాలలో, కవి సమ్మేళనాల్లో, ఉపన్యాస సభల్లో ఊపిరాడకుండా తిరుగుతున్నారని వింటున్నాను.

నేనూ మా నాన్నా వచ్చిన తర్వాత మావారికీ, మా బావగారికీ సంధి కుదిర్చాం. అప్పుడప్పుడు మావారు పెద్దబావగారింటికి వచ్చిపోతుండేటట్లూ, వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ చేదోడువాదోడుగా ఉండేటట్లూ, ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొనేటట్లూ, నీడల జాడల జోలికి పోకుండా సాహిత్య మీమాంస సాగుతూ ఉండేటట్లూ బేరాలు కుదిరించాం. ఆ సంధి అమలులోకి రావటం నేను ఒక నెల రోజులు ఉండే అవసరం పడటం- రెండూ కలిసి వచ్చాయి. ఆమేరకు ఇంతవరకూ అయిదారుసార్లు వచ్చి వెళ్లారు.

మా పెద్దబావగారు వారం రోజుల క్రితం ఒక జాతీయ ఆధ్యాత్మిక సదస్సులో పాల్గొనటానికి ఢిల్లీ వెళ్లారు. రేపో యెల్లుండో తిరిగి రావచ్చు. ఈ వారం రోజుల నుంచీ బావగారి పురమాయింపుమేరకు మావారు ఇక్కడే రాత్రిళ్లు పడుకుంటున్నారు. మల్లిక చెపుతున్న మాటలను బట్టి చూస్తే పగలు హాస్టల్ గదిలో ఉండటం కూడా అంతంతమాత్రమే నన్నమాట!

ఏమైతేనేం. మావారిని గురించి మరికొన్ని సంగతులు మల్లిక నుంచి రాబట్టాలని కోరికపుట్టింది. ఆసక్తితో మాటలు సాగించాను.

''మీ పరిచయం మొదటిసారి ఎక్కడ జరిగింది?''

'' యూనివర్సిటీ తెలుగు డిపార్ట్‌మెంట్ దగ్గర''

''ఏ సందర్భంలో?''

''నేను ఎం.ఏ. ప్రీవియస్ ప్రైవేటుగా రాస్తున్నాను. వారు రెగ్యులర్‌గా డిపార్ట్‌మెంట్‌లో చదువుతున్నారు. వారేమో పాఠాలన్నీ గురువుల దగ్గర క్లాసుల్లో వింటారు. పరీక్షల్లో ఏవేవి రావటానికి వీలుందో వారికి బాగా తెలుస్తుంది. అందువలన వారిని పట్టుకున్నాను మేడమ్! వారు అడిగితే నో అనరనుకోండి. దాని వలన తేలిగ్గానే వారి పరిచయాన్ని పొందగలిగాను.''

''అంతకుపూర్వం మీకు మావారు తెలుసా?''

''నాకు బాగా తెలుసు. కానీ, వారికి నేను జ్ఞాపకం లేను.''

''అదెలా?''



''జంట నగరాల్లో వున్న కళాశాలల్లోని తెలుగు పిల్లలందరూ కలిసి ఆంధ్రాభ్యుదయోత్సవాలను నిజాం కళాశాలలో ప్రతి యేటా జరుపుకుంటుంటారు. నిరుడు ఆ ఉత్సవాల్లో నేను భరతనాట్యం ప్రోగ్రామిచ్చాను. వారా ఉత్సవాలకు వ్యాఖ్యాతగా ఉండేవారు. నా నాట్యానికి వారు చేసిన కామెంట్రీ మంచి హంగు తెచ్చిపెట్టింది. నేను వారికి హార్టీ థాంక్స్ చెప్పాను. వారు నన్నెంతో ప్రోత్సహించి, పైకి రావాలని అభినందించారు.''

''మీకు అభినయం కూడా వచ్చునా?''

'' నాట్యంలో అభినయం ఒక భాగమే కదండీ!''

''మీరు మీ పరీక్షల పరిచయం గురించి చెపుతున్నారు.''

''వారూ నేనూ మరికొందరం రోజూ లాండ్ స్కేప్ గార్డెన్స్‌లో కలుసుకునేవారం.''

'' ఆ గార్డెన్స్‌లో ఏం చేసేవారు?''

''వారొక చెట్టు మొదట్లో కూర్చుండేవారు. మేం చుట్టూ అర్ధ చంద్రాకారంలో కూర్చుండేవాళ్లం. పరీక్షకు పనికివచ్చే అంశాలపై వారు అనర్గళంగా ఉపన్యాసం చెప్పేవారు.''

''ఉప న్యాసాలు కూడా పరీక్షలకు పనికొస్తాయా?''

''మేడమ్! అవి ఊకదంపుడు ఉపన్యాసాలు కావు. పరీక్షలకు పనికొచ్చే పాయింట్ల వడగళ్ల వాన. వారి ఉపన్యాసం ఒక గంటసేపువింటే చాలు. ఎన్నో రోజులు ఎన్నో పుస్తకాలు చదివిన అనుభవం అరచేతిలో ఉసిరికపండులా నిలుస్తుంది. వారు భవిష్యత్తులో మంచి ఆరేటర్ అవుతారు.''

''మీకు చెప్పటం వల్ల ఆయనకు లాభమేమిటి?''

''వారికి చదువు గట్టిపడుతుంది''

''గట్టి పడుతుందో-కరిగిపోతుందో..మీకేమైనా లాభం కలిగిందా?''

''వారు చెప్పిన ఉపన్యాసాలు విని నేను పరీక్షలు రాశాను. నేను రెఫరెన్స్ పుస్తకాలూ చూడలేదు. నోట్సులు రాసుకోలేదు; ఆన్సర్లు తయారు చేసుకోలేదు. వారే నాపాలిట మాట్లాడే గైడ్!..వారి ఉపన్యాసాలు విన్న తెలివితోనే పరీక్షల్లో క్లాసుమార్కులు తెచ్చుకున్నాను.''

''మీరంటే వారికి ఇష్టమా?''

''ఇంతవరకు నన్ను అంత ప్రేమగా చూచినవారు మరెవరూ లేరు.''

''ఇప్పుడు మరలా ఉపన్యాసాలు మొదలెడతా నన్నారా?''

''నేనడిగితే తప్పక మొదలు పెడతారు-నా కానమ్మకం ఉంది.''

''అడగటానికి వచ్చారా?''

''లేదు...నేను వచ్చింది మరో పని మీద''

''ఏంటి?''


''మీరేమనుకోవద్దు మేడమ్! ఆ సంగతి వారితోనే చెప్పాలి...ఎన్నాళ్ల నుంచో చెప్పాలని అనుకుంటున్నాను...ఎలా చెప్పాలా అని తికమక పడుతున్నాను. ఇక తప్పదు..ఇప్పటికే ఆలస్యమైపోయింది...రేపు చెప్పేయాలని నిర్ణయించుకొన్నాను..మేడమ్!...వారు రాత్రికి వస్తారుగా..చెప్పండి...నేను రేపు ఉదయం వస్తానని. తప్పకుండా వారిని ఉండమని..ఒక తియ్యనిమాట!...ఎన్నో జన్మల అనుబంధంలా మనసును మంచితేనెలో ముంచేమాట!...నా మనసులోని మాట!..''

మల్లిక ఊగిపోతూ చెపుతోంది..వెళ్లడానికి లేచింది..

''నాకోసం రేపు ఉదయం కనీసం ఉదయం ఎనిమిదింటి దాకా ఇంట్లో ఉండమనండి..'' ప్లీజ్! అని అడిగానని చెప్పండి..నన్ను నిరాశపరచవద్దని మరీ మరీ చెప్పండి. కాస్తమీరు కూడా రికమెండ్ చెయ్యండి మేడమ్!'' అంటూ గబగబా వెళ్లిపోయింది.

ఒక మల్లెపూల గాలిదుమారం ఆగినట్లయింది. ఆమె మాట్లాడినంత సేపూ పూలమీద ఎగురుతున్న సీతాకోక చిలుకలాగా అనిపించింది. ఏదో చెప్పలేని ఊహ ఊయల లూగినట్లనిపించింది. మల్లిక చిత్రమైన మనిషి.

మల్లిక మావారి ఫ్రెండని తెలుస్తోంది. కొన్నాళ్లుగా మంచి పరిచయముందని స్పష్టమౌతోంది. ఆమెకు మావారంటే అలివిమాలిన అభిమానమని అర్థమౌతూనే ఉంది..ఆయన కిష్టం లేకపోతే కథ యింతకాలం నడిచేదికాదు. అది అలా ఉంచితే..మరి ఆ మనసులోని మాటేమిటి?..తేనెకంటే తీపేమిటి?...ఆయనతో చెప్పే ఆ రహస్యమేమిటి?...ఇంకా ఏకాంతం కూడా కావాలంటుందేమో!



నాకు తల గిర్రున తిరిగినంత పనైంది. గుండెలో ఏదో తిరుగబోత వేసినట్లు దిగులుగా ఉంది. మావారిలో నాకు తెలియని రహస్య కోణాలెన్నో ఉన్నట్లు భయమేసింది. నాన్నతో కాసేపు మాట్లాడదామని లోపలికి వెళ్లాను. ఆయన దేవునిముందు కళ్లు మూసుకొని ఏదో ధ్యానంలో ఉన్నారు.

నేనూ ఓ గదిలో కిటికీ పక్కన కూర్చొని ఆకాశం వైపు చూస్తూ ఉండిపోయాను.

★★★

పక్కమీద పక్కనే పడుకున్నారు గాని మావారు మనలోకంలో లేరు.

''ఎవరిని గురించి ఆలోచిస్తున్నారు?'' అని చిలిపిగా అడిగాను.

''భువన విజయం గురించి''

''అదేమిటి?'' ఆశ్చర్యంతో అడిగాను.

''శ్రీకృష్ణదేవరాయల సాహిత్య సభను చిత్రించే సాహిత్య రూపకం''

''తెనాలి రామకృష్ణ సినిమాలో చూపించిందేనా.''

''ఆ అలాంటిదే..రెండు గంటల కార్యక్రమం..గుంటూరులో వేస్తున్నా రట! అందులో విశ్వనాథ

**ఒక మల్లెపూల గాలిదుమారం ఆగినట్లయింది. ఆమె మాట్లాడినంత సేపూ పూలమీద ఎగురుతున్న సీతాకోక చిలుకలాగా అనిపించింగి. ఏదో చెప్పలేని ఊహ ఊయల లూగినట్లనిపించింది. మల్లిక చిత్రమైన మనిషి.**

వారు అల్లసాని పెద్దనగా వ్యవహ రిస్తున్నారట.''

''కవులందరూ నాట కాలాడు తుంటారా?''

''మహాకవులకు చేతకాని విద్య ఉండదు.''

''మీరు కూడా పాల్గొన బోతున్నారా?''

''లేదు...చూచి రావాలని ఉంది. ఆ రూపకాన్ని కవి పండితుల చేత హైదరాబాదులో వేయించాలని ఉంది.''

''అందులో మీదే పాత్ర.''

''నే నేదేస్తే బాగుం టుంది?''

''చెప్ప మం టారా..మీరేమను కో నంటే..తెనాలి రామ కృష్ణుడి పాత్ర'' అని గలగలా నవ్వేశాను.

''నవ్విన నాపచేను కూడా ఒక్కోసారి పండుతుంది.''

''మొల్ల కూడా ఉం టుందా?''

''ఆ పాత్ర నీవేస్తావా?''

''రామకృష్ణుడికీ ఆమెకూ రంకులు కట్టే కథలున్నాయి-అందుకా?''

''వాటికి ఆధారాలు లేవు''

''లేకపోయినా మీరు కల్పించవచ్చు''

''భువన విజయంలో ఆడపాత్ర లేదు.''

'' మీ చదువుల నాటకాల్లో ఆడ పాత్రలుంటారా?''

''ఉంటారు..అంతే కాదు..ఆడ పాత్రలు ఆడవారే నిర్వహిస్తారు.''

''ఉద్యానవనాల్లో కూడానా?''


''ఇప్పుడా వనాలెందుకు జ్ఞాపకం వచ్చాయి?''

''మీ కోసం మధ్యాహ్నం మల్లిక వచ్చింది. ఏదో మనసులో మాట చెప్పుకోవాలట!...ఎన్ని పనులున్నా మిమ్మల్ని రేపు ఉదయం ఎనిమిది గంటల దాకా ఇంటిపట్టునే వుండమన్నది. ఆమాట మీతోనే చెప్పుకోవాలట!..మరి..ఏకాంతంలోనే ఏమో!'' నాకు తెలియకుండానే నా గొంతులో వాడిదనం వినిపించింది.

''మల్లిక మంచిపిల్ల..నాకు ఆమె అంటే ఎందుకో చెప్పలేని యిష్టం. ఎప్పుడో కోల్పోయిన ఆత్మీయురాలిని మరలా చూచినట్లనిపిస్తుంది.''

''మనస్సున్న వారికి మల్లెపూలన్నీ మంచివే.''

నామాటకు వారు వేదాంతిలా నవ్వారు. మావారికి నా మాటలు కోపం తెప్పిస్తాయోమోనని అనుకున్నాను. కాని, ఆయన నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నారు. మావారు ఆవేశపడకపోవటానికి కారణం వారి పరిచయం పాతబడిపోవటం




వల్లనని ఊహించాను. మావారు తొణకని నిండుకుండలా పడుకున్నారు.

ఆరోజు నేను మల్లెపూలు పెట్టుకొనే వున్నాను. నా మల్లెలు మావారి నాకర్షించ లేకపోయాయి. వారి మెదడులో భువన విజయమే కదులుతున్నదో, మల్లికా పరిమళమే తిరుగుతున్నదో..ఏమో! ఏమేమో!.మావారు ఆలోచనలో మునిగిపోయారు!

నేనూ సాలోచనగా మిగిలిపోయాను??

★ ★ ★

మావారు ఉదయం ఏడింటికే తయారై వరండాలో కూర్చున్నారు. నేనూ తెల్లవారుజామునే లేచి స్నానం చేసి, నాన్నగారికి టిఫిన్ చేసి పెట్టి వారిని ఆశ్రమానికి పంపి, మావారి ముందు తారట్లాడుతున్నాను.

''మన సంధి సంసారం తమాషాగా లేదూ?'' అన్నారాయన.

''మీకూ మీ అన్నగారికీ మధ్య సంధికాని, మన మధ్య సంధి యేమిటి?

సంధి సంసారమేమిటి?''నేను తెల్లబోయి అడిగాను.

''సంధి నియమాలతో చేసే సంసారం సంధి సంసార మంటారు.''

''నాకంత తెలివి లేదు లెండి''

''ఇవేళ రాఖీపూర్ణిమ. ఇవ్వాళ్టితో మీ నాన్నగారి దీక్ష ముగుస్తుందనుకుంటాను, రేపు మీ బావగారు వస్తారనుకుంటాను.''

''అయితే రేపే మేము బయలుదేరాలని కూడా అనుకుంటున్నారా?''

''ఇంతకంటే ఎక్కువకాలం మీరిక్కడ ఉండటం మంచిది కాదని కూడా అనుకుంటున్నాను.''

''మీ కంత కష్టంగా వుంటే తప్పక వెళ్లిపోతా లెండి.''

''ఉంటే మనిద్దరం కలిసి మనసొంతయింట్లో ఉండాలి. అది ఎంత చిన్నదైనా సరే; అద్దెదైనా సరే--అందులో ఉన్న నిండుదనం ఇందులో లేదు.''

''ఆంధ్ర పౌరుషం'' మీ అభిమాన గ్రంథంగా..మంచిదే.''

అంతలో గలగలా నవ్వుకుంటూ మల్లిక వచ్చింది. ఆమె వెంట మరో యువకుడు కూడా ఉన్నాడు. మావారు వారిద్దరికీ ఆహ్వానం పలికారు. పిచ్చాపాటీ కబుర్లు సాగుతున్నాయి. నేను కాఫీ లిచ్చాను. మావారు నన్నూ తన పక్కన కూర్చోమన్నారు. గుండె గుబగుబ లాడుతున్నా కొంచెం కుదుటపడి కూచున్నాను.

''మీరు నాకు ధైర్యం చెప్పిన హితులు, పాఠాలు చెప్పిన గురువులు, మాటలు నేర్పిన మార్గదర్శకులు-నా మనసంతా స్నేహంతో నింపిన కరుణామూర్తులు-ఎన్నాళ్ల బట్టో మీతో ఒక మాట చెప్పి...మీచేత ఔననిపించుకోవాలని కోరిక ఉంది...'' మల్లిక ఆర్ద్రంగా అడుగుతోంది.

''చెప్పండి'' అన్నారు మావారు.

''నాకు చిన్నప్పుడే అమ్మా నాన్నా కరువయ్యారు. మా పిన్నాన్న నన్ను గారాబంగా పెంచారు. వాళ్లకు పిల్లలు లేరు..నేనే వాళ్లకు ప్రాణాన్ని..సర్వస్వాన్ని..నన్ను పెద్దదాన్ని చేశారు. ఇదుగో నా ఫ్రెండ్ 'ప్రేమ్‌నాథ్'..మేమిద్దరం మా జీవితాలను ఒకటి చేసుకో దలచుకున్నాం.. మా కులాలు వేరైనా మనసు లొకటైపోయాయి. నిన్న ప్రేమ్‌నాథ్ అడిగాడు. 'నీకు అన్నలుగాని, అక్కలుగాని, చెల్లెళ్లుగాని ఎవ్వరూ లేరా?'' అని..నేను వెంటనే నాకొక అన్న ఉన్నాడు. రేపు చూపిస్తానని చెప్పి..నిన్న మీయింటికొచ్చాను...మీరు లేరు..మాడమ్‌కు చెప్పి వెళ్లాను..ఇదుగో ఇవ్వేళ వచ్చాం మేమిద్దరం.''

మల్లిక మెల్లగా లేచింది. మావారి కుడిముంజేతికి రాఖీ కట్టింది. ''అన్నయ్యా!'' అంటూ పాదాలకు దణ్ణం పెట్టింది.

మావారి కన్నులు చెమర్చాయి. ''నాకు తోబుట్టువులేని కొరత తీర్చావు తల్లీ!'' అంటూ ఆమె తలమీద చేతులతో దీవిస్తున్నారు.

నిన్న రాత్రి నా కోసం తెచ్చి, నాకు కప్పకుండా మావారు మరచిపోయిన చిన్నిపూలశాలువాను మల్లికకు కప్పి మనసారా కౌగిలించుకున్నాను.

★



# మంచివాడు..!

హీరోల్లో అరవిందస్వామిది ఓ ప్రత్యేక పంథా...! మితభాషి, ఆడవాళ్ళంటే తగని గౌరవం..! హుందాగా ఉంటాడు..అతగాడితో నేను నటించిన మొదటి చిత్రం 'రోజా' హిట్టయ్యిం తరువాత మళ్ళీ అలాంటి అవకాశం రాలేదు! అతనికి గానీ పెళ్ళి అవకుండా ఉంటే నేను వరించేదానినేమో...! అంటున్నది మధుబాల! మరి అర్జునుడి గతేమిటి..? నిజంగా మధుబాలను వరిస్తాడా..?

-కృష్ణజీ